ఖైరతాబాద్‌లో కేటీఆర్ రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన గులాబీ శ్రేణులు, స్థానికులు

సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ పక్కా

- దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి
- ఖైరతాబాద్‌లో మంత్రి కేటీఆర్ రోడ్‌షో

బంజారాహిల్స్.ఖైరతాబాద్, నవంబర్ 17: వరల్డ్ కప్‌లో ఇండియా విజయం పక్కా, అదే విధంగా నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో భారీ విజయంతో మూడోసారి కేసీఆర్ సీఎం అయ్యేది పక్కా అని ...బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా మంత్రి కేటీఆర్ శుక్రవారం సాయంత్రం రోడ్‌షోలు నిర్వహించారు. ముందుగా బంజారాహిల్స్ రోడ్ నెం 10లోని జహీరానగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన భారీ రోడ్ షోలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, వెల్దండ వెంకటేశ్, బీఆర్ఎస్ సీనియర్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ రోడ్‌షోలో పాల్గొన్నారు. బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ఎన్‌బీటీ నగర్, ఎన్‌బీనగర్, శ్రీరామ్‌నగర్, బోళానగర్, ఖాజానగర్, ప్రేమ్‌నగర్, ఉదయ్‌నగర్, అంబేద్కర్‌నగర్, సింగాడకుంట తదితర బస్తీలతో పాటు వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని నందినగర్, వెంకటేశ్వరనగర్, సింగాడికుంట, నాయుడు నగర్, దేవరకొండ బస్తీ, గౌరీ శంకర్ కాలనీ, నూర్‌నగర్, పంజాగుట్ట ప్రతాప్‌నగర్, షౌకత్‌నగర్, సుఖ్‌దేవ్‌నగర్, గాంధీపుర తదితర బస్తీల నుంచి వేలాదిగా జనం తరలివచ్చారు. మంత్రి కేటీఆర్ సభాస్థలానికి రాగానే జై తెలంగాణ నినాదాలు మిన్నంటాయి. కేసీఆర్ జిందాబాద్., కేటీఆర్ జిందాబాద్ అంటూ కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు.

జహీరానగర్ చౌరస్తాలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

ఖైరతాబాద్ గులాబీమయంగా మారింది. మంత్రి కేటీఆర్ రోడ్ షోకు విశేష స్పందన లభించింది. ఖైరతాబాద్‌లోని బడా గణేశ్ వద్ద మంత్రి కేటీఆర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత విష్ణువర్ధన్‌తో కలిసి రోడ్‌షోలో పాల్గొనగా వేలాదిగా తరలివచ్చిన గులాబీ శ్రేణులు జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ గులాబీ బెలూన్లు ఎగరవేసి అందరిని ఉత్సాహపరిచారు. మంత్రి కేటీఆర్ తనదైన శైలీలో ప్రతిపక్షాలకు కౌంటర్లు వేస్తూ తొమ్మిదిన్నరేండ్లు జరిగిన అభివృద్ధి, రాబోవు ఐదేండ్ల కాలంలో చేపట్టనున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్లుగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ అనునిత్యం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మితే మోసపోతారని, సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకోవాలన్నా రు. హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని తన కుటుంబం పనిచేసిందని, కాని నేడు కొందరు ఆ పార్టీ నేతలే తన రాజకీయ జీవితానికి పుల్‌స్టాప్ పెట్టాలని చూశారని, కాని సీఎం కేసీఆర్ అక్కున చేర్చుకొని తన జీవితంలో మళ్లీ వెలుగులు నింపారని మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో ఖైరతాబాద్ ముద్దుబిడ్డ దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.అనంతరం టీడీపీ, బీజేపీల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ప్రసన్న , బీఆర్ఎస్ ఖైరతాబాద్ డివిజన్ అధ్యక్షులు అరుణ్ కుమార్, మహేందర్ బాబు, మహేశ్ యాదవ్, ప్రవీణ్ కుమార్, తాండ్ర మేఘన, శ్యామ్, మురళీ, రాకేష్ లాల్, కె. రాజు, బాక్సర్ అశోక్, రాంరెడ్డి, లక్ష్మణ్ యాదవ్, చందు తదితరులు పాల్గొన్నారు.

సోమాజిగూడ నుంచి మూడువేల మంది

సోమాజిగూడ డివిజన్ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో బీఎస్‌మక్తా, ఎంఎస్‌మక్తా, అమీర్‌పేట పోచమ్మబస్తీ తదితర బస్తీలను సుమారు మూడు వేల మంది బీఆర్ఎస్ శ్రేణులు ఐమాక్స్ వద్ద గల 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి భారీ ర్యాలీతో బడా గణేశ్ వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహేశ్ యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎస్‌కె అహ్మద్, ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు, మాజీ కొర్పొరేటర్ లక్ష్మినారాయణమ్మ, మహిళా అధ్యక్షురాలు నాగలక్ష్మి, ఉపాధ్యక్షురాలు నాగమణి, నాయకులు వనం శ్రీనివాస్ యాదవ్, ఆనంద్ గౌడ్, రజినీ, గయాసుద్దీన్, ఉత్తమ్ జగన్, సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లో ముమ్మరంగా ప్రచారం

బంజారాహిల్స్,నవంబర్ 17: ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలంటూ కార్యకర్తలు ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, హిమాయత్‌నగర్, సోమాజిగూడ, ఖైరతాబాద్ డివిజన్ల పరిధిలో బూత్‌ల వారీగా కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఓటేయాలంటూ కోరుతున్నారు.

సోమాజిగూడలో...

ఖైరతాబాద్, నవంబర్ 17 : ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలంటూ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వనం సంగీత యాదవ్ శుక్రవారం బీఎస్‌మక్తాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బూత్ నం.98, 101, 102 103లలో పలువురు గృహిణులను కలిసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలంటూ కరపత్రాలు, మ్యానిఫెస్టోలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బీసీ సెల్ నాయకులు ఆనంద్ గౌడ్, ఉత్తమ్ జగన్, రజినీ, గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సబ్బండ వర్గాలకు మేలు

హిమాయత్‌నగర్, నవంబర్17: తెలంగాణ అభివృద్ధి కోసం అనుక్షణం పరితపిస్తున్న సీఎం కేసీఆర్ నేతృత్వంలోనే బంగారు తెలంగాణ సాధ్యమని హిమాయత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. 30న జరిగే పోలింగ్‌లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం నారాయణగూడ,శంషీర్‌బాగ్ బస్తీలో గడప గడపకు ప్రచారం చేస్తూ మ్యానిఫెస్టో పత్రాలను అందజేశారు. నాయకులు యాదగిరి, ఈశ్వర్, భరత్, అశోక్ పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ

బంజారాహిల్స్,నవంబర్ 17: ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఎన్నికల పరిశీలకుడు జయకాంతన్ పరిశీలించారు. ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని చింతల్‌బస్తీలో బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ స్లిప్స్ పంపిణీ చేస్తుండగా అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈనెల 25లోగా నియోజకవర్గంలోని ఓటర్లందరికీ స్లిప్పులను అందించాలని రిటర్నింగ్ అధికారి వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. ఓటర్ స్లిప్పులపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పోలింగ్ కేంద్రానికి సంబంధించిన వివరాలు కూడా కనిపిస్తామని పేర్కొన్నారు.

ప్రీ మెచ్యురిటీ డే సందర్భంగా వాకథాన్

బంజారాహిల్స్.నవంబర్ 17: నెలలు నిండకుండానే పుట్టే పిల్లల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు వరల్డ్ ప్రిమెచ్యురిటీ డే సందర్భంగా బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కువద్ద యోధ డయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం వాకథాన్ నిర్వహించారు. కేబీఆర్ పార్కు మెయిన్ గేట్‌నుంచి ప్రారంభమైన వాకథాన్ అమీర్‌పేట దాకా కొనసాగింది. ఈ వాకథాన్‌ను ప్రముఖ వైద్యురాలు డా.శిల్పారెడ్డి, డా. రవిశంకర్ తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యోధ ఫౌండర్ చైర్మన్ డా. సుధాకర్ కంచర్ల, గ్రూప్ డైరెక్టర్ రాధ ప్రశాంత్ పాల్గొన్నారు.

కనుల పండువగా మండల పూజ

బంజారాహిల్స్.నవంబర్ 17: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో మండల పూజ మహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా విశేష పూజలు, పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించారు. 40 రోజుల పాటు అయ్యప్పస్వాములకు భిక్ష అందిస్తారని ఆలయ ఈవో లావణ్య తెలిపారు.

సౌండ్ బాక్స్‌పై రామమందిరం నిర్మాణం

ఖైరతాబాద్, నవంబర్ 17 : అయోధ్యలోని శ్రీరామమందిరం తన సూచనల మేరకు సౌండ్ బాక్స్‌పై నిర్మించారని, తద్వారా వెయ్యేండ్ల వరకు చెక్కు చెదరకుండా ఉంటుందని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) వరంగల్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సామాజిక కార్యకర్త రామచంద్రతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. 2020 సెప్టెంబర్, డిసెంబర్ నెలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని నిపుణుల బృందంతో కలిసి వందలాది సంవత్సరాల క్రితం రామప్ప దేవాలయాన్ని ఇదే టెక్నాలజీతో నిర్మించారని, సౌండ్ బాక్స్, నీటితో తేలియాడే ఇటుకలతో నిర్మాణం అంశంపై చర్చించామన్నారు. అదే సంవత్సరం రామజన్మభూమి ట్రస్ట్ ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ రాజుతో నేతృత్వంలో కమిటీని నియమించిందన్నారు. సదరు కమిటీ దీనిపై సుధీర్ఘంగా అధ్యయనం చేసి సౌండ్ బాక్స్, నీటిలో తేలియాడే ఇటుకలతో నిర్మాణానికి అంగీకరించారన్నారు.